చేవెళ్ల గడ్డ బీఆర్‌ఎస్‌దే


శేరిలింగంపల్లిలో ప్రచారంలో పాల్గొన్న ఎమ్మెల్యే గాంధీ, అభ్యర్థి జ్ఞానేశ్వర్ కుమారుడు వీరేష్


శంకర్‌నగర్ వీకర్ సెక్షన్‌లో ప్రచారం చేస్తున్న కార్పొరేటర్ మంజుల రఘునాథ్‌రెడ్డి

శేరిలింగంపల్లి ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ

రాయదుర్గం: చేవెళ్ల పార్లమెంటు గడ్డపై ఎగిరేది బీఆర్ఎస్ జెండా మాత్రమేనని శేరిలింగంపల్లి ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ స్పష్టం చేశారు. చేవెళ్ల బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్ ముదిరాజ్‌కు మద్దతుగా శేరిలింగంపల్లి నియోజకవర్గంలోని పలు ప్రాంతాలలో జ్ఞానేశ్వర్ కుమారుడు కాసాని వీరేష్ ముదిరాజ్‌తో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా గాంధీ మాట్లాడుతూ ప్రజలను మభ్యపెట్టి అమలుకాని హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీకి తగిన గుణపాఠం చెప్పాల్సిన అవసరం ఉందన్నారు. కాసాని వీరేష్ మాట్లాడుతూ బీసీ అభ్యర్థి జ్ఞానేశ్వర్‌కు పట్టణ గ్రామీణ ప్రాంతాలలో మంచి ఆదరణ లభిస్తోందని, ప్రజల మద్దతు చూస్తుంటే భారీ మెజార్టీతో గెలవడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

చందానగర్ డివిజన్‌లో..

హఫీజ్‌పేట్: డివిజన్ పరిధిలోని భవానీ వీకర్స్ సెక్షన్, వేమన వీకర్స్ సెక్షన్ కాలనీలలో బీఆర్ఎస్ పార్టీ ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మంజుల రఘునాథ్‌రెడ్డి మాట్లాడుతూ అభివృద్ధి, సంక్షేమం బీఆర్ఎస్ పార్టీతోనే సాధ్యమన్నారు. తెలంగాణ రాష్ట్రంను అన్ని రంగాలలో అగ్రగామిగా నిలబెట్టిన వ్యక్తి కేసీఆర్ అని అన్నారు. రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో కారు గుర్తుకు ఓటు వేసి కాసాని జ్ఞానేశ్వర్‌ను గెలిపించుకుందామన్నారు. డివిజన్ అధ్యక్షులు రఘునాథ్‌రెడ్డి, నాయకులు, కార్యకర్తలు, వార్డు మెంబర్లు, ఏరియా, బస్తీ కమిటీ మెంబర్లు పాల్గొన్నారు.

◆ చందానగర్ డివిజన్ పరిధిలో రెడ్డికాలనీ, పద్మజ నగర్, రాజేంద్రరెడ్డినగర్, సురక్ష ఎన్‌క్లేవ్, శుభోదయ కాలనీ, డిఫెన్స్‌కాలనీ, విద్యానగర్ తదితర కాలనీలలో బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్ సతీమణి కాసాని చంద్రకళ, కార్పొరేటర్ మంజుల రఘునాథ్‌రెడ్డిలతో కలిసి ఆయన ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు, మాజీ కౌన్సిలర్లు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కేబుల్‌బ్రిడ్జి.. కేర్‌ఫుల్

బ్రిడ్జిపై రూల్స్ అతిక్రమిస్తే చర్యలు

- వంతెనపై వాహనాలను ఆపరాదు.. బర్త్‌డే పార్టీలు నిషేధం
- మాదాపూర్ సీఐ గడ్డం మల్లేష్




కేబుల్‌బ్రిడ్జిపై అవగాహన కల్పిస్తున్న మాదాపూర్ పోలీసులు

మాదాపూర్: ప్రతిష్టాత్మకంగా నిర్మించిన కేబుల్‌బ్రిడ్జి ఆత్మహత్యలకు అడ్డాగా మారింది. దీనికితోడు బ్రిడ్జిపై సందర్శకులు ఫొటోలు తీసుకునే క్రమంలో రోడ్డు ప్రమాదాలు చోటు చేసుకుంటుండడంతో పోలీసులు చర్యలు చేపట్టారు. కేబుల్ బ్రిడ్జిపై ఇప్పటికి 18 మంది ఆత్మహత్య చేసుకున్నారు. ఈ క్రమంలో కేబుల్ బ్రిడ్జిపై రూల్స్ అతిక్రమిస్తే చర్యలు తప్పవని మాదాపూర్ పోలీసులు హెచ్చరిస్తున్నారు. ఇక రాత్రి సమయాలలో సెల్ఫీలు, బర్త్‌డే పార్టీలను నిర్వహించుకోవద్దని, వాహనాలను కేబుల్‌బ్రిడ్జిపై నిలపరాదని మాదాపూర్ ఇన్‌స్పెక్టర్ గడ్డం మల్లేష్ తెలిపారు. ప్రతి శనివారం అవగాహన కార్యక్రమం నిర్వహిస్తున్నామని చెప్పారు.

ప్రశ్న: కేబుల్ బ్రిడ్జిపై ఆత్మహత్యలు ఎక్కువగా జరుగుతున్నాయి. మీరు తీసుకుంటున్న చర్యలు ఏమిటి ?

జ: కేబుల్ బ్రిడ్జిపై ఇప్పటికి 18 మంది ఆత్మహత్య చేసుకున్నారు. 4 రోడ్డు ప్రమాదాలు జరిగాయి. దీంతో ఆంక్షలు విధించాము. వాహనాలను నిలపరాదని, బర్త్‌డే పార్టీలు చేసుకోవద్దని, ప్రజలకు అవగాహన కల్పిస్తున్నాం.

ప్రశ్న: వాహనాలు పార్క్ చేస్తే విధించే జరిమానా?

జ: ప్రతి నెల (నో పార్కింగ్) డేంజర్ పార్కింగ్ చేస్తున్న వాహనాలు 450 నుంచి 550దాకా ఉంటున్నాయి. ఒక్కోదానికి ఫైన్ రూ.1000 వేస్తున్నాం.

ప్ర: పెట్రోలింగ్ లేని సమయంలో పార్టీలు చేసుకుంటే ఎలా గుర్తిస్తారు?


కేబుల్ బ్రిడ్జిపై వాహనాలకు ఫైన్ వేస్తున్న పోలీసులు

పెట్రోలింగ్ లేని సమయంలో పార్టీలు చేసుకున్నా, వాహనాలు పార్కింగ్ చేస్తే సీసీ కెమెరాల ద్వారా గుర్తిస్తాం. న్యూసెన్స్ చేస్తే సెక్షన్ 188 ప్రకారం శిక్షార్హులు .

ప్ర:మాదాపూర్ పోలీస్‌స్టేషన్ సిబ్బంది వివరాలు?

జ: మాదాపూర్‌లో ఏడు సెక్టార్‌లు ఉన్నాయి. ప్రతి సెక్టార్‌కి ఒక ఎస్సై అందుబాటులో ఉంటాడు. మాదాపూర్ పరిసర ప్రాంతాలలో ఏవైన సమస్యలు తలెత్తినా, అనుమానాస్పదంగా కనిపించిన సంబంధిత ఎస్సైలకు ఫోన్‌చేసి సమాచారం అందించాలి. ఇద్దరు సీఐలు, 9 మంది ఎస్సైలు మొత్తం సిబ్బంది 117 మంది అందుబాటులో ఉన్నారు. సమస్యలుంటే మాదాపూర్ పోలీస్ స్టేషన్ ఫోన్ నెం. 8331013220లలో సంప్రదించగలరు.

ప్ర: ఎన్నికల నేపథ్యంలో తీసుకుంటున్న చర్యలు?

జ: ప్రధాన కూడళ్లలో చెక్‌పోస్టులను ఏర్పాటు చేశాము. విస్తృత స్థాయిలో తనిఖీలు చేస్తున్నాము. నగదు పట్టుబడితే వాటి వివరాలను ఎప్పటికప్పుడు యాప్‌లో పొందుపరుస్తున్నాము. అనుమానాస్పదంగా వ్యక్తులు కనిపించినా, పత్రాలు లేని వాహనాలు దొరికిన వెంటనే దర్యాప్తు చేస్తున్నాము. ఎన్నికల సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా కాలనీలలో, కమ్యూనిటీలలో తదితర ప్రాంతాలలో అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తున్నాము.

ప్ర: మహిళా ఉద్యోగులకు రాత్రివేళ ఇబ్బందులు ఎదురైతే తీసుకోవాల్సిన జాగ్రత్తలు ?

జ: మాదాపూర్ ఐటీ ప్రాంతంలో కావడంతో ఎప్పుడూ రద్దీగా ఉంటుంది. వివిధ సెక్టార్‌లలో చాలా మంది మహిళలు రాత్రిపూట విధులను నిర్వహిస్తున్నారు. రాత్రి సమయాలలో షిఫ్టులు ఉండడంతో ఏదైన సమస్య వస్తే 100కి డయల్ చేయాలి. లోకేషన్, అలర్ట్ యాప్‌లు ఎన్నో వచ్చాయి. తల్లిదండ్రులకు, బంధువులకు, పోలీస్‌లకు అలర్ట్ మేసేజ్‌లు వెళ్లేలా యాప్‌లను డౌన్‌లోడ్ చేసుకుని వినియోగించుకోవాలి.

హస్తం గుర్తుకు ఓటు వేసి గెలిపించండి


అల్విన్‌కాలనీ డివిజన్‌లో ప్రచారం చేస్తున్న జగదీశ్వర్‌గౌడ్, కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్


చందానగర్ డివిజన్ పరిధిలోని వెంకటాద్రి నగర్‌లో..

కాంగ్రెస్ నాయకుల విస్తృత ప్రచారం

హఫీజ్‌పేట్: కాంగ్రెస్ పార్టీ చేవెళ్ల పార్లమెంట్ అభ్యర్థి డాక్టర్ రంజిత్‌రెడ్డికి ప్రజలు సంపూర్ణ మద్దతు ఇవ్వాలని హఫీజ్‌పేట్ డివిజన్ కార్పొరేటర్ పూజిత జగదీశ్వర్‌గౌడ్ పేర్కొన్నారు. శుక్రవారం డివిజన్ పరిధిలోని హుడా కాలనీలో ఇంటింటి ప్రచారం చేశారు. హస్తం గుర్తుకు ఓటు వేయాలని కోరారు.

చందానగర్ డివిజన్ పరిధిలో....

చందానగర్ డివిజన్ పరిధిలోని వెంకటాద్రినగర్‌లో కాంగ్రెస్ పార్టీ శేరిలింగంపల్లి నియోజకవర్గం ఇంచార్జి జగదీశ్వర్ గౌడ్ శుక్రవారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వంతోనే అభివృద్ధి సాధ్యమన్నారు . సీఎం రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలో శేరిలింగంపల్లి నియోజకవర్గాన్ని మరింత అభివృద్ధి చేస్తామన్నారు. ఈ ప్రచారంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు సునీత ప్రభాకర్‌రెడ్డి, జేరిపేటి రామచందర్‌రాజు, మిరియాల రాఘవరావు, ఉరిటి వెంకట్రావు, రఘుపతిరెడ్డి, శేఖర్‌రెడ్డి, మిరియాల ప్రీతం, మూర్తి, నితిన్‌గౌడ్, గౌస్ పాల్గొన్నారు.

అల్విన్‌కాలనీ డివిజన్‌లో..

అల్విన్‌కాలనీ: కాంగ్రెస్ పార్టీ చేవెళ్ల పార్లమెంట్ అభ్యర్థి రంజిత్‌రెడ్డికి ఓటు వేయాలంటూ శేరిలింగంపల్లి నియోజకవర్గ ఇన్‌చార్జి జగదీశ్వర్‌గౌడ్, కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్ ప్రచారం చేశారు. శుక్రవారం పార్టీ నాయకులతో కలిసి శంషీగూడ పరిధిలోని సాయిచరణ్ కాలనీ, ఇందిరానగర్ కాలనీలో పర్యటించారు.

మసీదుల వద్ద ప్రచారం

రంజిత్‌రెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరుతూ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్, కాంగ్రెస్ నాయకులతో కలిసి ఎల్లమ్మబండ గుడ్‌విల్ చౌరస్తా వద్ద దర్గా, ఎన్‌టీఆర్‌నగర్, పీజేఆర్ నగర్ మసీదుల వద్ద ముస్లింలకు కరపత్రాలు అందించి విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో యువనేత దొడ్ల రామకృష్ణ గౌడ్, సమ్మారెడ్డి, అనిల్ రెడ్డి, షౌకత్ అలీమున్నా, ఖాజా, పోశెట్టి గౌడ్, ఫారూఖ్, ఖలీమ్, మౌలానా తదితరులు పాల్గొన్నారు.

10న ఫిల్మ్ యాక్టింగ్ శిక్షణా తరగతులు ప్రారంభం

నాంపల్లి: పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం నాంపల్లి ప్రాంగణంలో రంగస్థల కళల శాఖ పక్షాన ఫిల్మ్ యాక్టింగ్ గురించి వేసవి శిక్షణా తరగతులు నిర్వహిస్తున్నట్లు రిజిస్ట్రార్ ఆచార్య భట్టు రమేష్ ఓ ప్రకటనలో తెలిపారు. నటన పట్ల ఆసక్తి కలిగిన ఔత్సాహిక విద్యార్థులకు 30 రోజుల పాటు శిక్షణ ఇచ్చి సర్టిఫికెట్ ఇవ్వడం జరుగుతుంది. ఈ తరగతుల్లో చేరాలనుకునే వారు పదవ తరగతి పాసై ఉండాలి. మే 10వ తేదీ నుంచి ప్రారంభించబడే కోర్సు మొత్తానికి కలిపి రూ.5వేలు ఫీజును చెల్లించాల్సి ఉంటుంది. సంబంధిత డిమాండ్ డ్రాఫ్టును రిజిస్ట్రార్ పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం పేరిట చెల్లించాలి. వివరాలకు 93464 61733లో సంప్రదించవచ్చు.

10 నుంచి శివసాయిక్షేత్రం వార్షిక బ్రహ్మోత్సవాలు

రాయదుర్గం: గచ్చిబౌలిలోని శివసాయిక్షేత్రంలో ఈనెల 10 తేదీ నుంచి 12వ తేదీ వరకు వార్షిక బ్రహ్మోత్సవాలు జరుగుతాయని ఆలయ మేనేజింగ్ ట్రస్టీ వాసిరెడ్డి పార్వతి శుక్రవారం వివరించారు. 10వ తేదీన ఉదయం 6 గంటలకు గణపతి అభిషేకంతో ఉత్సవాలను ప్రారంభిస్తారు. అనంతరం మంగళవాయిద్యాలతో ఆలయ ప్రదక్షిణ, అనంతరం పుణ్యవచనం, మండపారాధన, అఖండ దీపారాధన, వాస్తు, క్షేత్రపాలక సర్వతోభద్రమండల పూజల, ప్రధాన కలశ స్థాపన, మంగళ హారతి. ధ్వజారోహణ యాగశాల ప్రవేశం, గణ పతి, సుబ్రహ్మణ్య, శ్రీసూక్త, మన్యు, సూక్త, నవగ్రహ హోమాలు వంటి వాటిని నిర్వహిస్తారు.

పోలింగ్ స్టేషన్లను తనిఖీ చేసిన కలెక్టర్ శశాంక్


పోస్టల్ బ్యాలెట్ కేంద్రాన్ని సందర్శించిన ఆర్‌ఓ, రంగారెడ్డి జిల్లా కలెక్టర్ శశాంక్, ఏఆర్‌ఓ స్నేహ శబరిష్

గచ్చిబౌలి: చేవెళ్ల పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలోని శేరిలింగంపల్లి అసెంబ్లీ నియోజకవర్గంలోని పలు పోలింగ్‌స్టేషన్లను ఎన్నికల రిటర్నింగ్ అధికారి, రంగారెడ్డి జిల్లా కలెక్టర్ శశాంక్ తనిఖీ చేశారు. శుక్రవారం ఖాజాగూడ, రాయదుర్గం పోలింగ్ స్టేషన్లను సందర్శించారు. పోలింగ్‌స్టేషన్లలో చేసిన ఏర్పాట్లను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. అనంతరం శేరిలింగంపల్లి నియోజకవర్గం ఏఆర్‌ఓ కార్యాలయంలో ఓటరు ఫెసిలిటేషన్ సెంటర్‌ను ఆయన సందర్శించారు. శుక్రవారం ప్రారంభమైన పోస్టల్ బ్యాలెట్ ఈ నెల 8వ తేదీ సాయంత్రం 5 గంటల వరకు ఉంటుంది. రాష్ట్రంలోని 17 పార్లమెంట్ నియోజకవర్గాలకు సంబంధించి పోస్టల్ బ్యాలెట్ అందుబాటులో ఉంటుంది. ఏర్పాట్లను ఏఆర్‌ఓ స్నేహ కలెక్టర్‌కు వివరించారు.

కాంగ్రెస్‌లో చేరికలు

శేరిలింగంపల్లి: కాంగ్రెస్ ప్రభుత్వ పాలనకు ఆకర్షితులై పెద్దఎత్తున పార్టీలో చేరుతున్నారని ఆ పార్టీ శేరిలింగంపల్లి నియోజకవర్గ ఇంచార్జీ వి.జగదీశ్వర్‌గౌడ్ తెలిపారు. నల్లగండ్లలోని పార్టీ కార్యాలయంలో శుక్రవారం గచ్చిబౌలి డివిజన్ బీఆర్ఎస్ మహిళా విభాగం అధ్యక్షురాలు రామేశ్వ రమ్మ, నాయకులు వెంకటేష్‌గౌడ్, మల్లేష్ ముదిరాజ్‌ల ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. శ్రీనివాస్‌రెడ్డి, రజిత, సంజీవ, నిఖిత, స్వాతి,దివ్య, సంగీత, మౌనిక, మణిశర్మ, వెంకట్, బాలు, లడ్డు, సాయి, వంశీ, సందీప్, శివ, తేజ, మహేందర్ తదితరులు ఉన్నారు.

అల్విన్‌కాలనీ: తెలంగాణ టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ పటేల్ రమేష్ రెడ్డి, కార్పొరేటర్ వెంకటేష్‌గౌడ్, చేవెళ్ల కాంగ్రెస్ అభ్యర్థి గడ్డం రంజిత్‌రెడ్డి సోదరుడు నరేందర్ రెడ్డి సమక్షంలో శుక్రవారం ఆల్విన్ కాలనీ ఫేజ్ 1 కాలనీకి చెందిన బీఆర్‌యస్ పార్టీ నాయకుడు, కాలనీ అధ్యక్షుడు బత్తిన వెంకటేష్‌గౌడ్ తన అనుచరులతో కాంగ్రెస్ పార్టీలో చేరారు. కార్యక్రమంలో యువనేత దొడ్ల రామకృష్ణగౌడ్, సమ్మారెడ్డి, అనిల్‌రెడ్డి, గిరిప్రసాద్ రెడ్డి, సంజీవ్‌రెడ్డి, కృష్ణ ముదిరాజ్ తదితరులుపాల్గొన్నారు.


పార్టీలో చేరిన వారికి కండువాలు కప్పి ఆహ్వానించిన జగదీశ్వర్ గౌడ్ తదితరులు

ప్రజాస్వామ్యంలో ఓటే వజ్రాయుధం

- అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్
- (ఎంజీఐటీ) కళాశాలలో అవగాహన


ఓటు హక్కుపై అవగాహన కల్పించి ప్రతిజ్ఞ చేయిస్తున్న అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్

మణికొండ: ప్రజాస్వామ్యంలో ఓటే వజ్రాయుధమని తప్పకుండా వినియోగించుకోవాలని జిల్లా అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్ అన్నారు. గండిపేటలోని మహాత్మాగాంధీ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఎంజీఐటీ) కళాశాలలో కళాశాల ఎలక్టోరల్ లిట్రసీ క్లబ్, ఎన్‌ఎస్‌ఎస్ విభాగం, యంగిస్థాన్ ఫౌండేషన్ల సంయుక్త ఆధ్వర్యంలో శుక్రవారం ఓటరు అవగాహన సదస్సును నిర్వహించారు. ఆమె ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ జిల్లాలో పోలింగ్ శాతం పెంచేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటున్నామన్నారు. ప్రజలకు అందుబాటులో పోలింగ్ కేంద్రాలు అలాగే సౌకర్యాలు కల్పిస్తున్నామన్నారు. ఈసారి ఎండలను దృష్టిలో పెట్టుకుని పోలింగ్ సమయాన్ని సైతం ఎన్నికల కమిషన్ సాయంత్రం ఆరు గంటల వరకు పెంచిందని తెలిపారు. కార్యక్రమంలో స్వీప్ ఎన్నికల నోడల్ అధికారులు బి. శరత్‌చంద్ర, శ్రీలీల, యంగిస్థాన్ ఫౌండేషన్ ఫౌండర్ వై.అరుణ్‌కుమార్, కళాశాల ప్రిన్సిపాల్ జి. చంద్రమోహన్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులతో ఓటు వేస్తామని ప్రతిజ్ఞ చేయించారు.

నార్సింగిలో మోగిన అవిశ్వాస నగారా

- ఈ నెల 18న ప్రత్యేక సమావేశం
- ఆదేశాలు జారీ చేసిన కలెక్టర్
- కౌన్సిలర్లకు నోటీసులు జారీ చేసిన అధికారులు
- చైర్‌పర్సన్, వైస్ చైర్మన్‌పై అవిశ్వాసం
- 12 మంది సభ్యుల సంతకాలు


నార్సింగి మున్సిపల్ కార్యాలయం

మణికొండ: అధికార కాంగ్రెస్ పార్టీ ఒక్కో మున్సిపాలిటీను తన ఖాతాలో వేసుకుంటోంది. ఇటీవలే నార్సింగి మున్సిపాలిటీ చైర్‌పర్సన్, వైస్ చైర్మన్‌పై అవిశ్వాసం పెడుతూ 12మంది సభ్యులు కలెక్టర్‌కు లేఖ ఇచ్చిన విషయం తెలిసిందే. దీంతో సదరు లేఖను పరిగణనలోకి తీసుకున్న కలెక్టర్ శశాంక వారి సంతకాల పరిశీలనను పూర్తి చేయించి ఈ నెల 18వ తేదీన రాజేంద్రనగర్ ఆర్డీఓ వెంకట్ రెడ్డి ఆధ్వర్యంలో ప్రత్యేక సమావేశం నిర్వహించేందుకు ఆదేశాలు జారీ చేశారు. దాంతో నార్సింగి మున్సిపల్ అధికారులు, సిబ్బంది కలిసి కౌన్సిలర్లకు మున్సిపల్ చట్టం– 2019 , సెక్షన్ 37 ప్రకారం ప్రత్యేక సమావేశానికి హాజరై తమ బలం నిరూపించుకోవాలని శుక్రవారం నోటీసులు అందజేశారు.

ఆశలు వదులుకున్న బీఆర్ఎస్ వర్గం..

బండ్లగూడ మున్సిపల్ కార్పొరేషన్ తరహాలోనే నార్సింగిలోనూ అత్యధికంగా కౌన్సిలర్లు చైర్‌పర్సన్ రేఖాయాదగిరి,వైస్ చైర్మన్ వెంకటేశ్‌యాదవ్‌ను పదవీచ్యుతులను చేయాలని నిర్ణయించారు. మొత్తం 18 మంది సభ్యులున్న కౌన్సిల్‌లో అవిశ్వాస తీర్మానం నెగ్గాలంటే రెండింట మూడు వంతుల (12మంది) బలం అవసరం. తమ పార్టీకే చెందిన నలుగురు కౌన్సిలర్లు ఏకంగా అవిశ్వాస తీర్మాన పత్రంపై సంతకాలు చేయడంతో పాటు వారిలో ముగ్గురు 2 రోజుల క్రితం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. దాంతో కాంగ్రెస్ కౌన్సిలర్ల బలం గతంలో 6ఉండగా ప్రస్తుతం 9 మందికి పెరిగింది. వారితో పాటు పార్టీలకు అతీతంగా బీజేపీ సభ్యులు పద్మవీరారెడ్డి, ఆర్. ఆదిత్య రెడ్డి, బీఆర్ఎస్ కౌన్సిలర్ పత్తి ప్రవీణ్‌కుమార్ నిర్ణయించుకుని లేఖను అందజేశారు. దాంతో ప్రస్తుత చైర్మన్, వైస్ చైర్మన్ తమ పదవులపై ఆశలు వదులుకున్నట్టు తెలిసింది.

పార్టీ మారేందుకు సిద్ధపడినా..

నార్సింగి మున్సిపాలిటీ పరిధిలో ప్రస్తుత చైర్‌పర్సన్, వైస్ చైర్మన్‌పై అవిశ్వాసం పెడుతున్నారని సమాచారం తెలుసుకున్న వారు తామే పార్టీ మారతామని, తమ పదవులు అలాగే ఉంచాలని రాయబారం పంపినట్లు సమాచారం. అందుకు కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు బి.జ్ఞానేశ్వర్‌ముదిరాజ్, ముంగి జైపాల్‌రెడ్డి నుంచి ఎలాంటి స్పందన లేకపోవడంతో తమ పార్టీలో ఉన్న వారికే పదవులు ఇస్తామనే ఉద్దేశంతో వారి ప్రతిపాదనను తిరస్కరించినట్టు తెలిసింది. పార్లమెంట్ ఎన్నికల హడావిడి ముగియగానే ఈనెల 18వ తేదీన అవిశ్వాస సమావేశం నిర్వహించి ప్రస్తుత చైర్‌పర్సన్, వైస్ చైర్మన్‌ను పదవీచ్యుతులను చేసేందుకు 12 మంది కౌన్సిలర్‌లు సిద్ధంగా ఉన్నారు. అనుకున్నది అనుకున్నట్టుగా జరుగుతుందా..? లేదా ట్విస్టులతో మరింత రంజుగా నార్సింగి రాజకీయం మారనుందా..? అనేది తేలాలంటే ఈ నెల 18వ తేదీ వరకు వేచిచూడాల్సిందే.

రాడ్డుతో మోది హోటల్ యజమాని దారుణ హత్య


చెల్లూరి శ్రీనివాస్(ఫైల్)

గచ్చిబౌలి: పాత కక్షల నేపథ్యంలో ఓ వ్యక్తి ఇనుప రాడ్డుతో దాడి చేసి హోటల్ యజమానిని హత్య చేసిన సంఘటన రాయదుర్గం పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ సీహెచ్ వెంకన్న కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. కొండాపూర్, వైట్‌ఫీల్డ్స్ విల్లాస్‌లో నివాసం ఉండే చెల్లూరి శ్రీనివాస్(54) అంజయ్యనగర్‌లో సీఎస్ డెలాయిట్ ఇన్ హోటల్‌ను నిర్వహిస్తున్నాడు. హోటల్ వెనక భాగంలో ఓ గదిని అద్దెకు తీసుకొని స్టోర్ రూమ్‌గా వాడుకుంటున్నాడు. ఏడాది క్రితం స్టోర్ రూమ్ వద్ద సామగ్రితో వచ్చిన ఆటో రోడ్డుకు అడ్డుగా ఉందని పొరుగున ఉండే మహేందర్ గొడవ దిగాడు. ఈ విషయమై స్థానికుల సమక్షంలో పంచాయితీ పెట్టగా అందరూ మహేందర్ మందలించారు. దీంతో అతడిపై కోపం పెంచుకున్న మహేందర్ గురువారం సాయంత్రం ఇనుప రాడ్డు తీసుకుని హోటల్‌లోకి వెళ్లి సోఫాలో కూర్చొని ఉన్న శ్రీనివాస్ తలపై మోదాడు. దీనిని గుర్తించిన శ్రీనివాస్ కుమారుడు కేశవ్, హోటల్ సిబ్బంది అతడిని అడ్డుకున్నారు. అనంతరం తీవ్రంగా గాయపడిన శ్రీనివాస్‌ను గచ్చిబౌలిలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ అర్ధరాత్రి మృతి చెందాడు. నిందితుడిని పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

కాంగ్రెస్ పార్టీ కూకట్‌పల్లి బూత్ కమిటీల నియామకం

మోతీనగర్: బూత్ కమిటీ ఏజెంట్‌గా నియమితులైన ప్రతి ఒక్కరూ తమ డివిజన్ పరిధిలోని ప్రతి గడపకు వెళ్లాలని... పార్టీ మేనిఫెస్టోను ప్రజలకు అందజేసి కాంగ్రెస్‌కే ఓటు వేసేలా చూడాలని కూకట్‌పల్లి కాంగ్రెస్ ఇన్‌చార్జి బండి రమేష్ సూచించారు. పూర్తి స్థాయిలో బూత్ కమిటీల నియామకం అనంతరం శుక్రవారం ఆయన డివిజన్ అధ్యక్షులు, స్థానిక నాయకులు, ఏజెంట్లతో కలిసి సమావేశం ఏర్పాటు చేశారు. కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టోను ప్రజలకు వివరించి వారు కాంగ్రెస్‌కు ఓటు వేసేలా చూడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ కో ఆర్డినేటర్ వినయ్‌రెడ్డి, టీపీసీసీ ప్రతినిధులు సత్యం శ్రీరంగం, నాగిరెడ్డి, పుష్పరెడ్డి, సంజీవ్‌గౌడ్, పులి శివకుమార్‌గౌడ్, శ్రీకాంత్‌గౌడ్, లక్ష్మయ్య, మధుగౌడ్, యాదగిరి, నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

మనూలో 'ఎంఏ ఎకనామిక్స్' దరఖాస్తుల ఆహ్వానం

రాయదుర్గం: మౌలానా ఆజాద్ జాతీయ ఉర్దూ విశ్వవిద్యాలయంలో ఎంఏ ఎకనామిక్స్, పీహెచ్‌డీ కోర్సుల కోసం అడ్మిషన్ల ప్రక్రియను ప్రారంభించినట్లు 'మనూ' ఎకనామిక్స్ విభాగం హెడ్ ప్రొఫెసర్ ఫరీదా సిద్దిఖీ తెలిపారు. మెరిట్ ఆధారిత కోర్సుల కోసం ఆన్‌లైన్‌లోనే దరఖాస్తులను పంపాలన్నారు. దరఖాస్తులను సమర్పించడానికి చివరి తేదీ జూన్ 30వ తేదీ అని తెలిపారు. అదే విధంగా ఎకనామిక్స్ పీహెచ్‌డీ ప్రవేశానికి దరఖాస్తునకు మే 20 ఆఖరు. దరఖాస్తునకు మనూ వెబ్‌సైట్‌ను సందర్శించాలని, మరింత సమాచారం కోసం ఫోన్ నంబర్ 6526900810, 8421932098లలో సంప్రదించాలని కోరారు.

హెచ్‌సీయూలో విద్యార్థి సంఘాల నిరసన



రాయదుర్గం: హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో మృతి చెందిన రోహిత్ వేముల మరణంపై పోలీసుల నివేదికను నిరసిస్తూ క్యాంపస్‌లో పలు విద్యార్థి సంఘాలు శుక్రవారం సాయంత్రం నిరసన తెలిపాయి. హెచ్‌సీయూలోని ఏఐటీసీఏ, ఏఐఎస్‌ఏ, ఏఎస్‌ఏ, బీఎస్‌ఎఫ్, డీఎస్‌యూ, ఫ్రెటర్నిటీ, ఎంఎస్‌ఎఫ్, ఎస్‌ఎఫ్‌ఐ, టీఎస్‌ఎఫ్, హెచ్‌సీయూ స్టూడెంట్స్ యూనియన్ కలిసి భారీ ర్యాలీ నిర్వహించారు. నార్త్ షాపింగ్ కాంప్లెక్స్‌లోని వెలివాడల నుంచి యూనివర్సిటీ మెయిన్ గేట్ వరకు ఈ ర్యాలీ కొనసాగింది. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ రోహిత్‌ది 'ఇన్‌స్టిట్యూషనల్ మర్డర్' అనివారు విమర్శించారు. విద్యార్థుల నిరసన నేపథ్యంలో పెద్ద సంఖ్యలో పోలీసులు క్యాంపస్‌కు చేరుకొని ప్రధాన గేటు వద్ద ముందస్తు చర్యలు చేపట్టారు. రోహిత్‌కు న్యాయం జరిగే వరకు పోరాటాన్ని సంఘటితం చేస్తామని విద్యార్థి నాయకులు స్పష్టం చేశారు.

5న ఉచిత వైద్యశిబిరం

కూకట్‌పల్లి: కేపీహెచ్‌బీ కాలనీ రోడ్డు నంబర్ 4లోని కె.కె రెడ్డి హాస్పిటల్ ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్య శిబిరం ఈ నెల 5వ తేది ఆదివారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు ఉంటుంది. ఈ వైద్య శిబిరంలో ఛాతీ వైద్య నిపుణులు డా. మల్లికార్జునరెడ్డి ఆధ్వర్యంలో ఆస్తమా, న్యూమోనియా, పిల్లికూతలు, అలర్జీ, బ్రాంకైటీస్, టీబీ, హెచ్ఐవి, లంగ్ క్యాన్సర్, గురక వంటి సమస్యలకు ఉచిత వైద్యం చేస్తారు. అలాగే చెవి, ముక్కు, గొంతు, మధుమేహం, రక్తపోటు, గుండెపోటు, మూత్రపిండం, కాలేయం, పక్షవాతం, కీళ్లనొప్పుడు, థైరాయిడ్ తదితర సమస్యలకు వైద్య చికిత్సలు అందిస్తారు. చెస్ట్ ఎక్స్‌రే, 2డి ఎకో, ఈసీజీ, పిఎఫ్‌టి, ఆర్‌బీయస్ టెస్టులు ఉచితంగా చేస్తారని తెలిపారు. మరిన్ని వివరాలకు 8143010104, 91549938412 నంబర్లలో సంప్రదించవచ్చు.

విద్యార్థులకు అభినందనలు


విద్యార్థులను అభినందిస్తున్న జగదీశ్వర్‌గౌడ్ తదితరులు

శేరిలింగంపల్లి: పదవ తరగతి ఫలితాల్లో అత్యుత్తమ ఫలితాలు సాధించిన త్రివేణి స్కూల్ విద్యార్థులను శేరిలింగంపల్లి కాంగ్రెస్ పార్టీ ఇంచార్జీ జగదీశ్వర్‌గౌడ్ అభినందించారు. శుక్రవారం నల్లగండ్లలో జగదీశ్వర్‌గౌడ్‌ను కలసిన విద్యార్థులను శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో హఫీజ్‌పేట్ కార్పొరేటర్ పూజిత జగదీశ్వర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ పార్టీ గెలుపు ఖాయం

రాయదుర్గం: చేవెళ్లలో బీఆర్ఎస్ అభ్యర్థి గెలుపు ఖాయమని గచ్చిబౌలి మాజీ కార్పొరేటర్ కొమిరిశెట్టిసాయిబాబా అన్నారు. శుక్రవారం సాయంత్రం గచ్చిబౌలి డివిజన్‌లోని నానక్‌రాంగూడలో ఇంటింటి ప్రచారంలో భాగంగా ఓటర్లను కలిసి అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్‌కు ఓటు వేయాలని కోరారు. ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉంటూ కాలనీలు, బస్తీలలో పూర్తి స్థాయి మౌలిక సదుపాయాలను కల్పించడమే లక్ష్యంగా పనిచేస్తామన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, మాజీ వార్డు, ఏరియా కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

రూ.3,34,000 లక్షలు నగదు పట్టివేత

పటాన్‌చెరు టౌన్: వాహన తనిఖీలో రూ.మూడు లక్షల 34 వేలు పట్టుకున్నారు. పటాన్‌చెరు పోలీసుల కథనం ప్రకారం... మెహిదీపట్నం మల్లేపల్లికి చెందిన నందికొండ వరుణ్‌కుమార్ రేడియంట్ క్యాష్ మేనేజ్‌మెంట్‌గా పనిచేస్తున్నాడు.ఈ క్రమంలో శుక్రవారం ఉదయం వరుణ్ కుమార్ తన ద్విచక్ర వాహనంపై లింగంపల్లి వైపు నుంచి పటాన్‌చెరు వస్తుండగా పట్టణంలోని బజాజ్ షోరూం ఎదురుగా నిర్వహించిన వాహన తనిఖీలో పోలీసులు వరుణ్ ద్విచక్ర వాహనాన్ని తనిఖీ చేసి డబ్బు పట్టుకున్నారు. పట్టుబడిన నగదుకు సరైన ఆధారాలు చూపకపోవడంతో వాటిని పోలీసులు సీజ్ చేశారు.

భెల్‌లో సమ్మర్ క్యాంప్ ప్రారంభం

రామచంద్రాపురం(పటాన్‌చెరు): భెల్ టౌన్‌షిప్ కమ్యూనిటీ సెంటర్ అధ్యర్యంలో ఏర్పాటు చేసిన సమ్మర్‌క్యాంప్‌ను భెల్ జీఎం చంద్రశేఖర్ శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భెల్ క్రీడా మైదానంలో ఆడిన క్రీడాకారులు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణిస్తున్నారని తెలిపారు. క్రీడాకారుల అభివృద్ధికి భెల్ యాజమాన్యం తన వంతు కృషి చేస్తుందన్నారు. కార్యక్రమంలో కమ్యూనిటీ సెంటర్ ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్, అధికారులు మయబ్రహ్మ పాల్గొన్నారు.

సీఎం బహిరంగ సభలో చైన్ స్నాచర్ల హల్‌చల్

- 8 బంగారు గొలుసుల అపహరణ
- ఆలస్యంగా వెలుగులోకి

హఫీజ్‌పేట్: ఇటీవల శేరిలింగంపల్లి నియోజకవర్గం తారానగర్‌లో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ బహిరంగ సభకు భారీగా నాయకులు, కార్యకర్తలు తరలి రావడంతో దీనిని అదనుగా తీసుకుని చైన్ స్నాచర్లు హల్‌చల్ చేశారు. 8 మంది మెడలోనుంచి బంగారు గొలుసులు అపహరించారు. సభ ముగిసిన అనంతరం నగలు చోరీకి గురైనట్లు గుర్తించిన బాధితులు చందానగర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. గురువారం రాత్రి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టిన పోలీసులు తారానగర్ సమీపంలో సీసీ టీవీ ఫుటేజీల ఆధారంగా నిందితుల కోసం గాలింపు చేపట్టారు. త్వరలోనే నిందితులను పట్టుకుంటామని చందానగర్ సీఐ పాలవెల్లి తెలిపారు.